ప్రజాశక్తి
సోమవారం 6 మార్చి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

యువకుడిని కాపాడిన పోలీస్

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు: ఎస్పీ

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆత్మహత్యకు యత్నించిన నిజాంపట్నం మండలం, పలపట్ల గ్రామానికి చెందిన గోరిపర్తి శ్రీను అనే యువకుడి ప్రాణాలను సూర్యలంక బీచ్ అవుట్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు కాపాడారు. గోరిపర్తి శ్రీను శనివారం అర్ధరాత్రి సూర్యలంక సముద్ర తీరంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చి వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో చేతిని కోసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలుసుకున్న అతడి బంధువులు బాపట్ల రూరల్ పోలీస్ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన రూరల్ ఎస్సై వెంకటప్రసాద్ సూర్యలంక అవుట్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఏం.పోతురాజును ఆదేశించారు. ఆయన స్విమ్మర్స్ సురేష్, ఆంజనేయులు సహాయంతో సూర్యలంక సముద్ర తీరంలో ఉన్న అటవీ ప్రాంతంలో గాలించి యువకుడిని గుర్తించారు. అప్పటికే అతడి కుడిచేతి మణికట్టు నుండి ధారాళంగా రక్తం కారుతుండడంతో వెంటనే అతడిని బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్యం చేయించి.. యువకునికి కౌన్సిలింగ్ నిర్వహించి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కోలేక చిన్నచిన్న సమస్యలను సైతం భూతద్దంలో చూస్తూ భయపడిపోయి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య వుంటుందని, సానుకూల ధోరణితో ఆలోచిస్తే ఆ సమస్యలకు పరిష్కార మార్గాలు ఉంటాయన్నారు. సానుకూల ధోరణిలో ఒక క్షణం ఆలోచించినా ఆత్మహత్యలు నివారించడం సులభమన్నారు. సమస్యలను బాధలను సన్నిహితంగా ఉండే బంధువులు, స్నేహితులతో పంచుకోవడం ద్వారా పరిష్కారం లభించే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులు సైతం బలహీన మనస్తత్వం ఉన్న వారిని ఒంటరిగా వదలడం మంచిది కాదన్నారు.

మమ్మల్ని గెలిపిస్తే..

ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం..

- మిమ్మల్ని గెలిపిస్తే చేసే మేలేంటో చెప్పండి..
- రాజకీయ పార్టీల అభ్యర్థులకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ ప్రశ్న

ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తమను గెలిపిస్తే శాసనమండలిలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, మిమ్మల్ని గెలిపిస్తే ఓటర్లకు చేసే మేలేంటో చెప్పి.. ఓట్లు అడిగితే బాగుంటుందని పిడిఎఫ్ తూర్పు, రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి రాజకీయపార్టీ అభ్యర్థులకు సూచించారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన రూ.12 వేలు, రూ.14 వేల వేతనాలకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేస్తున్నారని, ప్రస్తుతం ఉన్న ధరల నేపథ్యంలో వారి జీతాలు ఏమూలకు సరిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు స్కూల్స్‌లో, కాలేజీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈపిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి, వారి సంక్షేమానికి రూ.1000 కోట్లతో నిధి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సర్వీసు రూల్స్, ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన జీవో విడుదల చేయాలని కోరారు. వాలంటీర్లను క్రమబద్ధీకరించి, వారికి టైం స్కేల్ ఇవ్వాలన్నారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిఆర్‌పిలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు పెరిగిన ధరకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఆర్టీసి ఉద్యోగులకు పిఆర్‌సి ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలు ఇవ్వాలని కోరారు. ఎంతో విలువైన ఆర్టీసి స్థలాలను లీజులపేర ప్రయివేటుపరం చేసే విధానాలను ఆపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆశలను వమ్ము చేసిందని విమర్శించారు. ప్రజాసమస్యలపై అనేక ఏళ్లుగా మండలిలో పోరాడుతోందని పిడిఎఫ్ ఎంఎల్‌సిలేనని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, నిరుద్యోగులు, రైతులు, కూలీలు, చేతి వృత్తులు వారి తరపున మండలిలో వారి గొంతుకలై గళం విప్పుతామని చెప్పారు. పిడిఎఫ్ ఏ ఒక్కరి పక్షమో కాదని, అందరి పక్షాన నిలబడి సమస్యలపై పోరాడుతోందని హామీ ఇచ్చారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలలో తాను విస్తృతంగా తిరిగానని, మూడు జిల్లాల పరిధిలో ఉన్న 170 మండలాలకు గానూ దాదాపు 110 మండలాలలో పర్యటించి వివిధ తరగతుల ప్రజల సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు. ఏ ఒక్క వర్గం వారు కూడా ప్రభుత్వ విధానాల పట్ల సంతృప్తిగా లేరని పేర్కొన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, విద్యావంతుడిగా ప్రజా సమస్యలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని, తనను గెలిపిస్తే ప్రజలకు మేలు చేసేలా పనిచేస్తానని హామీ ▶ 2లో

ట్యాంకర్ల నీరే ఆధారం..!

- తోటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- బోర్లు వేసినా పడని నీళ్లు
- అప్పులపాలవుతున్న అన్నదాతలు

ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న దృశ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సాగు చేసిన తోటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్కనీరు పడకపోవడంతో అప్పులపాలవుతున్నారు. గత్యంతరం లేక ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకొని తోటలకు తడులు పెడుతున్నారు.

యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో ఈ ఏడాది 7250 ఎకరాల్లో మిరప, 150 ఎకరాల్లో అరటి, 600 ఎకరాల్లో నిమ్మ, 1700 ఎకరాల్లో బత్తాయి, 180 ఎకరాల్లో బొప్పాయి, 120 ఎకరాల్లో జామ, 190 ఎకరాల్లో మామిడి, 1430 ఎకరాల్లో కూరగాయల పంటలను సాగు చేశారు. వాటిని రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో పొలాల్లో ఉన్న బోరు అడుగంటిపోవడంతో ఒక్కో బోరుకు రూ.లక్ష చొప్పున ఖర్చు చేసి 800 నుంచి 1000 అడుగుల లోతుకు కొత్త బోర్లు వేయించారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతు మూడు బోర్లు కూడా వేశారు. అయినా ఒక్క బోరులో కూడా చెమ్మ కూడా పడకపోవటంతో బోర్ల కోసమే ఓ రైతు రూ.మూడు లక్షలు అప్పులపాలయ్యాడు. ఇదే పరిస్థితి వందలాది మంది రైతులకు ఏర్పరిండి. అసలే ఎకరాకు రూ.70 వేలు నుంచి రూ. 1.50 లక్షలు ఖర్చు చేసి పంటను సాగు చేస్తే తీరా పంట చేతికి వచ్చే సమయంలో భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లు మొరాయించడంతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోవాల్సి వచ్చింది.

లారీ ట్యాంకర్‌తో తోటలకు నీళ్లు పెడుతున్న దృశ్యం

ట్యాంకర్ల నీటితోనే..

సాగులో ఉన్న తోటలను రక్షించుకునేందుకు గత్యంతరం లేక రైతులు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. చిన్న ట్యాంకరు నీటిని రూ.వెయ్యికి, అదే పెద్ద ట్యాంకర్ అయితే రూ.4 వేలు నుంచి రూ.5 వేలు చొప్పున చెల్లించి దూర ప్రాంతాల ▶ 2లో

వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సందీప్ ప్రకాష్

దాచూరి వైద్యశిబిరానికి

విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో బిపి, షుగరు, ఫిట్స్, పక్షవాతం రోగులకు నిర్వహించే రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం స్థానిక డిఆర్ఆర్ఎం మున్సిపల్ పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ క్యాంపునకు విశేష స్పందన లభించింది. 1590 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ సందీప్‌ప్రకాష్, డాక్టర్ ఎం.రవితేజతో పాటు మరో 17 మంది వైద్యులు పాల్గొని వైద్యసేవలందించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు రూ.400కే నాలుగు నెలలకు సరిపడా మందులు, తక్కువ ధరకు ఇన్సులిన్‌ను అందజేశారు. వైద్యం వ్యాపారం అయ్యి నిరుపేదలకు వైద్యం దూరమైన నేపథ్యంలో గత ఎనిమిది సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఒంగోలులో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రెగ్యులర్ మెడికల్ క్యాంపునకు చీమకుర్తికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జవహర్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయనకు మెడికల్ క్యాంపు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం నాటి క్యాంపులో పాల్గొని సేవలందించిన డాక్టర్లు, వాలంటీర్లు, ఎన్‌సిసి విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులకు క్యాంపు కన్వీనర్ మాదాల వెంకట్రావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. టీచర్స్ అభ్యర్థిగా పి.బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా తనను ఈ నెల 13న జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షులు ఎవి.పుల్లారావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పివిఆర్.చౌదరి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిజాయతీగా పనిచేసే సత్తా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆల్ పెన్షనర్స్ సంఘం నాయకులు శేషయ్య, సిఐటియు నాయకులు చీకటి శ్రీనివాసరావు, పి. కల్పన, దామా శ్రీనివాసులు, జి. శ్రీనివాసులు, ఎఐటియుసి నాయకులు సర్దార్, వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ నాయకులు కెఎఫ్.బాబు పాల్గొన్నారు.

ట్యాంకర్ల నీరే ఆధారం.!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి నీటిని తెచ్చుకొని తోటలకు తడులు పెడుతున్నారు. ఎకరానికి చిన్న ట్యాంకర్లయితే ఎనిమిది పడుతున్నట్లు చెబుతున్నారు. అదే పెద్ద ట్యాంకర్లయితే మూడు ట్యాంకర్ల సరిపోతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇలా వారానికోసారి తడులు పెట్టి కాపాడుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇలా ఎకరం తడపడానికి రూ.10 వేలు నుంచి రూ.15 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇంత ఖర్చు చేసినా దిడుబడి వస్తుందన్న నమ్మకం లేదని కంటనీరు పెడుతున్నారు.

నీళ్లు దొరకడం లేదు

పాశం వెంకటేశ్వర్లు, రైతు, కుందంపల్లి

అప్పు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకొని తోటలకు తడులు పెట్టుకుందామన్నా నీళ్ల దొరకడం లేదు. గత్యంతరం లేక దూర ప్రాంతాల నుంచి పెద్ద ట్యాంకర్ల ద్వారా నీళ్ల తోలుకోవాల్సి వస్తోంది. ఆ ట్యాంకర్ల ద్వారా తోటలు తడుపుకోవాలంటే అదనంగా పైపులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో మరో రూ.ఐదు వేల దాకా పైపుల కోసమే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

నీళ్ల తోలకం డబ్బులు చెల్లించాలి

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

రైతులు తోటలను రక్షించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకొని ఇబ్బందులు పడుతున్నారు. అప్పుల పాలవుతున్నారు. గత ప్రభుత్వంలో తోటలను బ్రతికించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకున్న రైతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అలాగే ఈ ప్రభుత్వం కూడా నీళ్ల తోలకం డబ్బులను మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

సాగర్‌నీటితో చెరువులను నింపాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

సాగర్‌నీటితో చెరువులను నింపాలని రైతులు కోరుతున్నారు. ఈ నెలాఖరుకు సాగర్‌నీటి విడుదలను నిలుపుదల చేస్తున్న నేపథ్యంలో చెరువులను నింపాలని వారు కోరుతున్నారు. వేసవి దృష్ట్యా పశువులకు తాగునీటి సమస్య రాకుండా చూడాల్సి అవసరం ఉందన్నారు. రామతీర్థం రిజర్వాయర్ నీటిమట్టం 85.34 మీటర్లు కాగా ప్రస్తుతం 85 మీటర్లు నీటిమట్టం ఉంది. రిజర్వార్ నుంచి క్రిందికి 350 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. రిజర్వాయర్‌లోకి 350 క్యూసెక్కుల నీరు వస్తుంది. ఒంగోలు బ్రాంచి కాలువకు 100 క్యూసెక్కులు,త్రోవగుంట మేజరుకు 60 క్యూసెక్కులు, కారుమంచి కాలువకు 40 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ఒంగోలు

రహదారిపై ప్రవహిస్తున్న సాగర్ నీరు

రామతీర్థం రిజర్వాయర్

సమ్మర్‌స్టోరేజీలకు నీరు వదులుతున్నారు. మరో 20 రోజులుపాటు ఒంగోలు సమ్మం్‌స్టోరేజీలకు నీరు వదిలితే ట్యాంకులు రెండూ పూర్తిగా నిండే అవకాశముంది.ప్రస్తుతం రైతులు తమ పొగాకు తోటలకు,సరుగుడు,సుబాబులు తోటలకు నీరు పెట్టుకుంటున్నారు. రిజర్వాయర్ పరిధిలోని నోటిఫైడ్, నాన్‌నోటిఫైడ్ చెరువులు, కుంటలు, మంచి నీటి చెరువులు నింపాల్సి ఉంది.

వృథాగా పోతున్న సాగర్ జలాలు

రిజర్వాయర్ నుంచి నీటిని క్రిందికి నీటిని వదులుతున్నారే తప్ప, ఆనీరు సక్రమంగా వినియోగించుకునేలా అధికారులు పర్యవేక్షణ లేదు. దీంతో సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. కొందరు రైతులు తమ పొలాలకు నీరు పెట్టుకొని, వదిలేస్తున్నారు. దీంతో నీరు రోడ్లపై పారుతోంది. స్థానిక బూచేపల్లి కమలాకరరెడ్డి పార్కు రోడ్డులో రోడ్డుపై నిత్యం రోడ్డుపై నీరుపారుతోంది. బైపాస్‌రోడ్డు ఆనుకొని ఉన్న పొలాల వద్ద రోడ్డుపై నీరు పారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జయరాంపురం తాండాలో దాహం కేకలు

- మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్
- నిరుపయోగంగా బోరు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గిద్దలూరు

మండల పరిధిలోని జయరాంపురం తాండాలో గత కొద్ది రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో సుమారు 40 కుటుంబాల ఉన్నారు. వారందరికీ బోరు నీరే ఆధారం. ట్రాన్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో బోరు పనిచేయడం లేదు. నిరుపయోగంగా మారింది.

మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్

నిరుపయోగం మారిన బోరు

సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులు చేసుకొని జీవనం సాగించే తాము నీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి లైటు

ఆరని వీధిలైట్లు ..!

ప్రజాశక్తి- మద్దిపాడు

మండల కేంద్రమైన మద్దిపాడు వీధి దీపాలు ఆర్పే పనిలేదు. పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. గత కొన్ని నెలలుగా పగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా త్రీ పేస్ విద్యుత్ వల్ల వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని తాము విద్యుత్ ఎఇ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఆ వాహనాలకు.. నంబరు ప్లేట్లు అవసరం లేదా..?

ప్రజాశక్తి- కంభం రూరల్

కంభం పట్టణంలో నంబరు ప్లేట్లు లేని మట్టి ట్రాక్టర్లు అతి వేగంతో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అర్ధవీడు మండలం నాగులవరం సమీపం లోని కొండల వద్ద నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్లు పట్టణంలోని పలు ప్రాంతాలకు మట్టి, ఇసుకను సరఫరా చేస్తున్నాయి. కొన్ని ట్రాక్టర్లకు నంబరు ప్లేట్లు లేవు. వాటిని డ్రైవర్లు వేగంగా ఇష్టమొచ్చినట్లు నడుపుతున్నారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వాహనాలు వేగంగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోనని హడలి పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నంబరు ప్లేట్లు లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నంబరు ప్లేటు లేని ట్రాక్టర్

వెయిట్ లిఫ్టింగ్‌లో ఉప్పుగుండూరు యువకుడి సత్తా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన యువకుడు జి. సిటిజన్ సత్తా చాటాడు. పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలో జాతీయ స్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కిలోల విభాగంలో 4వ స్థానంలో నిలిచాడు. సిటిజన్ 85 కిలోల బరువును పైకెత్తాడు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్‌ఉఐ) ఆధ్వర్యంలో 2023 సంవ్సతరానికి నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపాడు. సిటిజన్ తండ్రి ఎలీషా వాలీబాల్ క్రీడాకారుడు. సిటిజన్ ప్రస్తుతం పాండుచ్చేరిలో ఎస్‌ఎఐ శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో తనకు ప్రోత్సాహం అందిస్తున్న ఎస్‌ఎఐ కోచ్ కుక్కల

సిటిజన్

విరలకు ఈ సందర్భంగా సిటిజన్ ధన్యవాదాలు తెలిపారు.జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన సిటిజన్‌ను గ్రామస్తులు ఆదివారం అభినందించారు.

సింగరకొండ తిరునాళ్ల ప్రారంభం

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండ క్షేత్రంలో ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ప్రారంభమయ్యింది. మొదటి రోజు కార్యక్రమంలో ఉదయం 8.30 గంటల నిమిషాలకు గణపతి పూజ, పుణ్యాహవచన అఖండ దీపస్థాపన, మండపారాధన కార్యక్రమాలను ఆలయ పూజారులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభ నిర్మాణ దాత మేదరమెట్ల శంకరరెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే, వైసిపి మూడు జిల్లాల కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి గార్లచే జీవ ధ్వజ పూజ, ఉష్ణ పతాక పూజ, ధ్వజారోహణ కార్యక్రమంలో నిర్వహించి తిరునాళ్లను ప్రారంభించారు. అనంతరం ప్రసన్నాంజనేయ స్వామి చెంతన ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఉదయం 10.00 గంటలకు భజన కార్యక్రమం, రాత్రి ప్రసన్నాంజనేయ తోలు బొమ్మలాట బృందం వారిచే తోలు బొమ్మలాట నాటక ప్రదర్శన, అనంతరం కోలాట ప్రదర్శన నిర్వహించారు. రాత్రి అత్యంత వైభవోపేతంగా జరిగిన గజ వాహన సేవలో ఉభయ దాతలు శిద్దా పాండురంగారావు - సుధావళి, వెంకట సురేష్ కుమార్ - శిరీష కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోట శ్రీనివాస్‌కుమార్, ఆలయ ఈఓ టి సుభద్ర ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

మొదటిరోజు సింగరకొండ తిరుణాల ప్రారంభ దృశ్యం

అద్దంకి నుంచి సింగరకొండకు బస్సు సర్వీసులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండలోని లక్ష్మీ నృసింహ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 68వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవం ఈనెల 7వ తేదీ మంగళవారం జరుగుతున్న సందర్భంగా అద్దంకి నుంచి సింగరకొండకు ఆర్టీసి బస్సులను నడుపుతున్నట్లు అద్దంకి డిపో మేనేజర్ బి రామమోహనరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం మంచిది కాదని అన్నారు. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం శ్రేయస్కరమని పేర్కొన్నారు. తిరునాళ్లకు వెళ్ళేవారు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు. ఈ నెల 7వ తేదీ మంగళవారం తిరునాళ్లకు ఆదివారం ఉదయం 4.30 గంటల నుంచి అద్దంకి, మేదరమెట్ల, దర్శి, ఒంగోలు, చీరాల, సమీప ప్రాంతాల నుంచి ఆర్టీసి బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచి నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

ఇంకొల్లు పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మద్యం దుకాణంలో సూపర్‌వైజర్ చేతివాటం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు పర్చూరు రోడ్డులోని మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న మార్టూరి వెంకట ప్రశాంత్ చేతివాటం ప్రదర్శించాడు. దుకాణంలోని 42 సీసాలను ఎవరికీ తెలియకుండా బయట వ్యక్తులకు అధిక ధరలకు అమ్ముతున్నాడు. సమాచారం అందుకున్న ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ వలపన్ని ప్రశాంత్‌ను పట్టుకున్నారు. అతని నుంచి 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అధిక ధరలకు ఎవరైనా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాయబ్ రసూల్ హెచ్చరించారు.

కాలిపోతున్న బొగ్గుల బట్టీ

బొగ్గుల బట్టీలో అగ్ని ప్రమాదం

రూ.20 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని అయ్యంబొట్లపల్లి గ్రామ సమీపంలో గల బొగ్గుల బట్టీలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అయ్యంబొట్లపల్లి గ్రామానికి చెందిన ఉమ్మనేని వేణు అనే వ్యాపారి అయ్యంబొట్లపల్లి గ్రామ సమీపంలో బొగ్గుల బట్టీని నిర్వహిస్తున్నారు. ఆదివారం కట్టెలతో బొగ్గులు తయారు చేస్తుండగా మంటలు చెలరేగి పక్కనే ఉన్న కర్రతో పాటు వినియోగానికి సిద్ధంగా ఉన్న బొగ్గులు కాలి బూడిద అయ్యాయి. ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలను ఆర్పేందుకు అక్కడి కార్మికులతో పాటు అయ్యంబొట్లపల్లి గ్రామస్థులు ప్రయత్నం చినా ఉపయోగం లేకుండాపోయింది. యర్రగొండపాలెం నుంచి అగ్నిమాపక దళ వాహనం వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసే లోపే బొగ్గులన్నీ కాలి బూడిదైపోయాయి. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బొగ్గుల బట్టీ యజమాని ఉమ్మనేని వేణు కోరారు.

భూ వివాదంలో రెండు గ్రూపుల ఘర్షణ

ఆరుగురికి గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-అర్ధవీడు

ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం పోతురాజుటూరు గ్రామంలో శనివారం జరిగిన భూ వివాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రాథమిక వైద్యం కోసం కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మార్కాపురం గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారని మార్కాపురం హాస్పిటల్ డాక్టర్ తెలియజేశారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని రమేష్ ఆసుపత్రికి తరలించారు. కటికల రాజరత్నం వయసు 45 సంవత్సరాలు, కటికల జయరాజు 48 సంవత్సరాలు కటికల చంద్రశేఖర్ 40 సంవత్సరాలు వీరి ముగ్గురి పరిస్థితి వారం రోజుల వరకు ఏమీ చెప్పలేమని డాక్టర్స్ తెలిపారు. వీరి ముగ్గురికి తలలో బ్లడ్ క్లాట్ కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్స్ తెలియజేశారని చెప్పారు అలాగే కటికల రవిబాబు వయసు 40 సంవత్సరాలు ఇతని ఆరోగ్యం మెరుగ్గా ఉందని డాక్టర్స్ తెలియజేశారు క్షతగాత్రులు నలుగురూ ఎస్సీ కమ్యూనిటీకి చెందినవారు. ప్రత్యర్థులు బిసి కమ్యూనిటీకి చెందినవారు అని కటికల రవిబాబు తెలియజేశారు.

చెట్టుకు ఉరేసుకున్న రవీంద్రరెడ్డి

ఆర్మీ జవాను ఆత్మహత్య

ప్రజాశక్తి-చినగంజాం, బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెదగంజాంకు చెందిన ఆర్మీ జవాను కోమట్ల రవీంద్రరెడ్డి(26) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. ఆర్మీలో జవానుగా పని చేస్తూ ఇటీవల సెలవులకు తన గ్రామం వచ్చిన రవీంద్రరెడ్డి గ్రామ శివారులో ఉన్న జీడిమామిడి తోటలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి పొద్దుపోయాక మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కట్టా అనూక్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

స్కూటీని ఢీకొట్టిన ఇన్నోవా.. వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-పంగులూరు

జాతీయ రహదారిపై వెళుతూ, రోడ్డును క్రాస్ చేయబోయిన స్కూటీని ఇన్నోవా కారు ఢీకొట్టిన ప్రమాదంలో, వృద్ధురాలు గొట్టిపాటి సుబ్బమ్మ(77) అక్కడికక్కడే మరణించింది. స్కూటీపై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై, వెంకటాపురం స్టేజికి 100 గజాల దూరంలో ఆదివారం రాత్రి 7:20 గంటల ప్రాంతంలో జరిగింది. రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. పంగులూరు మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎర్రమోసు మోహన్‌రావు, గొట్టిపాటి వసంత, గొట్టిపాటి సుబ్బమ్మలు స్కూటీపై అలవలపాడు నుంచి అద్దంకి బయలుదేరారు. జాతీయ రహదారిపై అలవలపాడు స్టేజి దాటి వెంకటాపురం స్టేజి వైపు వెళ్లేందుకు అక్కడ ఉన్న గుడికి 100 గజాల దూరంలో రోడ్డు దాటుతుండగా, గుంటూరు వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై మధ్యలో కూర్చున్న గొట్టిపాటి సుబ్బమ్మ కింద పడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించింది. స్కూటీని నడుపుతున్న ఎర్రమోసు మోహన్‌రావు, వెనుక కూర్చున్న గొట్టిపాటి వసంతకు స్వల్ప గాయాలయ్యాయి. రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన యువకుడు

డివైడర్‌ను ఢీకొని యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డ ఘటన మార్టూరు సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఆదివారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దరిశి పట్టణానికి చెందిన కర్ర ప్రసాద్ విజయవాడలో జరిగిన ఓ ప్రవేశ పరీక్షకు హాజరయ్యాడు. అనంతరం తన స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. బైక్ మార్టూరు సమీపంలోకి రాగానే అదుపుతప్పి జాతీయ రహదారిపై ఉన్న ఇనుప గ్రిల్స్ డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన వెనుక వాహనదారులు 108కి సమాచారమిచ్చారు. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను 108 సిబ్బంది ముందుగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మార్కాపురంరూరల్

కాలువలో పడి మృతిచెందిన రమణారెడ్డి

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న బోడపాడు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మార్కాపురం పట్టణ పరిధిలోని తూర్పు వీధిలో నివాసం ఉంటున్న ఎర్రరెడ్డి రమణారెడ్డి తన సొంత పొలంలో వ్యవసాయ పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై నుంచి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎర్రరెడ్డి రమణారెడ్డి(45)పై ద్విచక్ర వాహనం పడడంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు మార్కాపురం పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా రెండో పట్టణ ఎస్ఐ ఎం సువర్ణ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాల తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం సువర్ణ తెలిపారు.

ఉరేసుకొని బాలుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కంభం రూరల్

మృతదేహాన్ని పరిశీలించిన ఎస్ఐ

కంభం సత్యసాయిబాబా గుడి దగ్గర నివాసం ఉంటున్న నూనె విజయ్ కుమార్(15) అనే బాలుడు తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చనిపోయాడు. కంభం ఎస్ఐ వి నాగమల్లేశ్వరరావు సంఘటన స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతికి గల కారణం పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉందని అన్నారు.

యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం

ప్రజాశక్తి-రేపల్లె

నేటి సమాజంలో యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉంది. పోలీస్ యంత్రాంగం మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ గంజాయి వ్యాపారం చాపకింద నీరులా పట్టణాల నుంచి పల్లెలకు వ్యాపించింది. ఒకప్పుడు వత్తిడిని తట్టుకోలేక సినిమా ఇండస్ట్రీలో కొందరు, ఇంజనీరింగ్, మెడిసిన్ కళాశాలల విద్యార్థులు తీసుకునే గంజాయి నేడు హైస్కూల్ స్థాయికి చేరుకుంది. తల్లిదండ్రులు తమ పిల్లలపై అమితమైన ప్రేమానురాగాలు కురిపించటం, పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు మందలించిన వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుండటంతో యువత పక్కదారి పడుతున్నారు. ఇటీవల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పలు హత్యలు, హత్యాచారాలలోని నిందితులు గంజాయి మత్తులో చేయటం పోలీసులకు సవాలుగా మారింది. డివిజన్‌లోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో గంజాయి సిగరెట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో సిగరెట్ రూ.100 వరకు అమ్ముతున్నారు. రేపల్లె పట్టణంలో ఇసుకపల్లి ఏరియా, జగనన్న కాలనీ సమీపంలో, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో వెనుక వైపు ఉన్న పొలాల్లో, ఓల్డ్ టౌన్, అరవపల్లి శ్మశానవాటిక సమీపంలో, రాణిగారిసత్రం, రెండో వార్డు, ఐదో వార్డు, నేతాజీనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. మండల పరిధిలోని గ్రామాల సమీపంలోని నిషేధిత ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలు గంజాయి స్మగ్గింగ్‌కు పాల్పడే వారికి అడ్డాలుగా మారాయి. గంజాయి విక్రయాలకు పాల్పడేవారు కొరియర్ సర్వీసుల ద్వారా ఎవ్వరికీ అనుమానం రాకుండా సెల్‌ఫోన్ సైజ్‌లో ప్యాక్ మాదిరి రవాణా చేస్తున్నారు. ఇడియట్ సినిమాలో బైక్ పైన అలీ బీదర్ నుంచి ఇసుక తీసుకువచ్చిన రీతిగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నవారు తమ ద్విచక్ర వాహనాల ద్వారా గంజాయిని తరలిస్తున్నారు. స్కూటీలైతే సీటు కింద డిక్కీలో, బైక్ అయితే సైడ్ డోర్‌లలోను, యుటిలిటీ బాక్స్‌లోను గంజాయి పెట్టుకుని నిర్దిష్ట ఏరియాలకు తరలిస్తున్నారు. ఇప్పటికయినా, తల్లిదండ్రులు తమ పిల్లలను గమనించుకోవటం, చెడు వ్యసనాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి వారికి కౌన్సెలింగ్ ఇప్పించటం చెయ్యాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా తమ ఏరియాలో ఇలాంటి వ్యసనాలకు బానిసలుగా మారి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి. పోలీసు అధికారులు సమాచారం ఇచ్చిన వారిని గోప్యంగా ఉంచుతామనే భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు, నాయకులు, పోలీసులు సమిష్టి బాధ్యతగా వ్యవహరించి గంజాయి స్మగ్లింగ్, విక్రయాలు, అరికట్టి సమాజ శ్రేయస్సుకు, యువత భవిష్యత్‌కు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎంఎం కొండయ్య సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

టిడిపిలోకి 20 కుటుంబాలు..

వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారు: ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల: వైసిపి పాలనతో రాష్ట్ర ప్రజలందరూ విసిగిపోయారని రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని రెండు మూడు నాలుగు వార్డులలో సుమారు 20 కుటుంబాల ముస్లింలు, టిడిపి రాష్ట్ర నాయకురాలు పంచుమర్తి అనురాధ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు సజ్జ వెంకటేశ్వర్లు వారికి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సజ్జ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నిస్తూ యువనేత లోకేష్ చేపట్టిన పాదయాత్రను వైసిపి అడుగున అడ్డుకుంటూ ఆటంకాలను సృష్టిస్తుందని అన్నారు. వైసిపి ప్రభుత్వం నియంతపాలన కొనసాగిస్తోందని, ప్రజలు అందరూ గమనిస్తున్నారని, ప్రశ్నించే టిడిపి నేతలను అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, కూరపాటి పూర్ణచంద్రరావు, కొమ్మనబోయిన రజిని, కౌతవరపు జనార్దన్, బుద్ది శివయ్య కరిముల్లా, మంగపతి పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహశీల్దారు తమన్న

జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 140 మంది చెస్ ప్లేయర్స్ పోటీల్లో పాల్గొన్నారు. చీమకుర్తి మండల తహశీల్దారు పిన్నిక మధుసూదనరావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ పాలపర్తి రవీంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ టోర్నమెంటును ఏపీ చెస్ అకాడమీ ఒంగోలు వారు, విద్యానికేతన్ స్కూల్ వారు నిర్వహించారు. టోర్నమెంట్లో గెలుపొందిన విద్యార్థులకు తహశీల్దారు మధుసూదన రావు, కరస్పాండెంట్ రవీంద్రబాబు, ఏపీ చెస్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు, మెమెంటోస్, మెడల్స్, సర్టిఫికెట్స్ బహూకరించారు. ఈ ఒక టోర్నమెంట్లో పార్టిసిపేషన్ చేసిన ప్రతి ఒక్క ప్లేయర్‌కు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి శివం ఫౌండేషన్, అమ్మ క్యాటరింగ్ వాళ్ళు సహకరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పిఇటి టీచర్స్ కోటేశ్వరరావు, వెంకట్, అనంతలక్ష్మి, ఏవో శేఖర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చింతచెట్ల చింత తీరేనా?

- చెట్ల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులో
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-పర్చూరు

రోడ్డు పక్కన ఉన్న చింతచెట్లను తొలగించడంలో జరుగుతున్న ఆలస్యం రోడ్డు వెడల్పు చేసే పనులకు ఆటంకంగా మారింది. పర్చూరు-ఇంకొల్లు (పాతమద్రాసు రోడ్డు విస్తరణ) అభివృద్ధికి 2 సంవత్సరాల క్రితం 22 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ పిలిచి ఏడాది దాటింది. సాంకేతిక కారణాలతో పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఎట్టకేలకు ఇటీవల పర్చూరు వైసీపీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ ఇంకొల్లులో పనులకు శంకుస్థాపన చేశారు. ఇంకొల్లు గ్రామ పరిధి నుంచి నాగుల చెరువు రోడ్డు వరకు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు మరో ఆరు నెలలు మాత్రమే ఉంది. సకాలంలో పూర్తి చేయాలనే ఉద్దేశంతో పర్చూరు వైపు నుండి అభివృద్ధి పనులు చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపులా 1.5 మీటర్లు చొప్పున వెడల్పు చేయాల్సి ఉంది. ఇందుకోసం రోడ్డు అంచులలో ఉన్న చింత చెట్లను తొలగిస్తేనే పనులు వేగవంతం జరుగుతుంది. పర్చూరు-ఇంకొల్లు మధ్య 0/375 నుంచి 19/680 వరకు రోడ్డుకు రెండు వైపులా ఉన్న సుమారు 600 చెట్లు తొలగించేందుకు అధికారులు గత సంవత్సరం ఆఖరులో టెండర్లు పూర్తి చేశారు. దీనికోసం రూ.2.85 లక్షలు కేటాయించారు. 2 వారాల సమయంలో చెట్ల తొలగింపు కార్యక్రమం పూర్తి చేయాల్సిన నిబంధన షరతు విధించారు. ఇప్పటికి 2 నెలలు పూర్తవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. అక్కడక్కడ చెట్లను కొమ్మల వరకు మరి కొన్ని చోట్ల మొదళ్ళ వరకు రంపంతో కోసి వదిలేశారు. చెట్టు భూమిలో ఉండే మొదలుతో సహా తీయాల్సి ఉంది. లేకుంటే చెట్లు మళ్ళీ మొలకెత్తడంతో పాటు రోడ్డు నాణ్యత కూడా క్షీణించే ప్రమాదం ఉంది. ప్రస్తుతం చేస్తున్న పనులను గమనిస్తే ఇంకా 2 నెలలు అయినా చెట్లు తొలగించే పరిస్థితి కనిపించటం లేదు. చెట్లు తొలగింపులో ఆర్అండ్‌బి అధికారులు విఫలమయ్యారనే వార్తలు వినవస్తున్నాయి. చెట్ల తొలగింపు చర్యలు వేగవంతంగా చేపడితే రోడ్డు నిర్మాణం త్వరగా జరిగే వీలుంది. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

పర్చూరు-ఇంకొల్లు రోడ్డులో తొలగించని చింతచెట్ల మొద్దులు

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

మహిళల కోసం ప్రత్యేక చట్టాలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మహిళల కోసం ప్రత్యేక చట్టాలు రాజ్యాంగం రూపొందించిందని ప్రముఖ న్యాయవాది మేకల రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంకొల్లు ఎస్‌ఆర్‌అండ్‌బివిఎస్‌ఆర్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని న్యాయం పొందవచ్చని అన్నారు. కర్ణాటకలో ఒక గిరిజన మహిళ అడవుల సంరక్షణ చేపడుతూ 30 వేల మొక్కలు నాటినందుకు ఆమెకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసిన సంగతిని ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి గుర్తు చేశారు. సమావేశానికి ప్రధానోపాధ్యాయిని వి ఉదయకుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ కె శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కెజెఆర్ కుమారి, కె పుష్పలత, టి వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

36 కేంద్రాలలో టైప్ రైటింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-రేపల్లె

టైప్ రైటింగ్ పరీక్షలు ఆదివారం స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలలో జరుగుతున్నాయని టైప్ రైటింగ్ ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. రేపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో టైపు రైటింగ్ ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్‌కు 8 మంది, ఇంగ్లీషు లోయర్ గ్రేడ్‌కు 21 మందికిగాను 20 మంది, ఇంగ్లీష్ హయ్యర్ గ్రేడ్‌కు 17 మంది, మొత్తం 46 మందికి గాను, పరీక్షలకు 45 మంది హాజరయ్యారన్నారు. ఇంగ్లీష్ లోయర్‌కు ఒక్కరు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు.

స్విమ్మింగ్ అసోసియేషన్‌కు ఎంపికైన విజేతలు

బాపట్ల జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

ఆదివారం బాపట్ల జిల్లా మంతెనవారిపాలెంలో బాపట్ల జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఎన్నికలు, జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా నవీన్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ తరపున పరిశీలకులుగా రమేష్ హాజరయ్యారు. వీరి సమక్షంలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కూసంపూడి రాకేష్‌వర్మ, ఉపాధ్యక్షుడుగా చింతల వినయ్ చౌదరి, సెక్రటరీ మంతెన నాగ మురళి, జాయింట్ సెక్రటరీ ఖాజా మొహిద్దీన్, ట్రెజరర్‌గా దండు శివరామరాజు ఎన్నికయ్యారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, బాబు రెడ్డిని గెలిపించాలని జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ బి.హరిబాబు కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని పాకల గ్రామంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజల పక్షాన నిలబడే పిడిఎఫ్ అభ్యర్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు కోటపాటి నారాయణ, కొల్లూరి వెంకయ్య, బుర్ల సుధాకర్, వి.ఆనంద్ కుమార్, శ్రీనివాసులు రెడ్డి ,ప్రతాప్ రెడ్డి, నాగార్జున, పడిదపు రవికుమార్ పాల్గొన్నారు .**టంగుటూరు :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేశపోగు మోజెస్ కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ స్థానిక వాణి నగర్, అంబేద్కర్ నగర్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు కూలీ, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో మాట్లాడగలిగేది ఒక్క పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని తెలిపారు. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు తానికొండ నారాయణ మాస్టర్, టంగుటూరి వెంకట్రావు, కొల్లాబత్తిన శ్రీనివాస్ పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్ :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిపిఐ, ఎఐటియుసి, సిఐటియు, వివిధ ప్రజా సంఘాలు, మేధావులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందె నాసరయ్య మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల శాసన సభ నియోజక వర్గం నుంచి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ శాసన సభ నియోజవర్గ నుంచి పి.బాబు రెడ్డి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శింగరాయకొండలో ప్రచారం నిర్వహిస్తున్న జెవివి నాయకులు

టంగుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన : బాలాజీ

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగుతుందని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. స్థానిక కామేపల్లి రోడ్డులోని సీతారామకల్యాణ మండపంలో టిడిపి కొండపి నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అధ్యక్షత వహించారు. తొలుత టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌టిఆర్, దామచర్ల విగ్రహాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నట్లు తెలిపారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ఎలాంటి అడ్డంకులు కలిగించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బాదుడే..బాదుడు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దామచర్ల సత్య, కొండపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మండవ మోహన్‌కృష్ణ, టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిరీక్షన్‌బాబు, కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రావిపాటి సీతమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

దామచర్ల సత్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కొండపి

కొండపి నియోజక వర్గ ప్రజలకు దామచర్ల కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. దామచర్ల సత్య పుట్టిన రోజు సందర్భంగా స్థానిక పొగాకు బోర్డు వద్ద నుంచి కామేపల్లి రోడ్డులోని శ్రీ సీతారామ కళ్యాణమండపం వరకూ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సత్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ బొమ్మ వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు దామచర్ల సత్యను గజమాలతో సత్కరించారు. అనంతరం దామచర్ల సత్యను కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, కొండపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మండవ మోహన్‌కృష్ణ, టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిరీక్షన్‌బాబు, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రావిపాటి సీతమ్మ, శింగరాయకొండ నాయకులు నిరసన బ్రహ్మయ్య, మందలపు గాంధీచౌదరి, చీమకుర్తి కృష్ణ, కొనపురెడ్డి సుబ్బారావు శాలువాలు, పుష్పగుచ్చాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

చీరల పంపిణీ

రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య పుట్టిన రోజు సందర్భంగా మండల పరిధిలోని అనకర్లపూడి ఎస్‌సి కాలనీకి చెందిన 100 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. టిడిపి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయపాటి సీతమ్మ తన సొంత నిధులతో ఈ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి వసంతరావు, సరసారెడ్డి, బత్తుల నారాయణస్వామి, గుండపనేని రామూర్తి నాయుడు, మహిళా మండల అధ్యక్షురాలు బొద్దులూరి ప్రసన్న, బొద్దులూరి విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. **టంగుటూరు :** టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొండపి నియోజకవర్గ యువ నాయకులు దామచర్ల సత్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వల్లూరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సత్య టంగుటూరులో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా దామచర్ల కుటుంబానికి అండగా ఉన్న నియోజకవర్గ ప్రజలకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలమని వ్యాఖ్యానించారు. మీకు ఎప్పుడు, ఎలాంటి అవసరం వచ్చినా నేరుగా తనను కలవవచ్చని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు కామని విజయకుమార్, కామని నాగశ్రీను, తెలుగు యువత అధ్యక్షుడు అబ్బూరి అభిషేక్, ఐటిడిపి మండల కార్యనిర్వాహక కారత్యదర్శి తగరం సుమన్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్నాసి బ్రహ్మానందం, నాయకులు మొఘల్ కాలేషా బేగ్, కసుకుర్తి భాస్కర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపిలో సత్యను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

టంగుటూరులో మాట్లాడుతున్న దామచర్ల సత్య

వీర రాఘవ శాస్త్రి విగ్రహానికి నాయకుల నివాళి

వీర రాఘవ శాస్త్రికి నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బహు గ్రంధకర్త, గద్వాల ఆస్థాన కవి, మహాకవి, శతావధాని దివంగత గాడేపల్లి వీర రాఘవ శాస్త్రి 79వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెంలోని ఆయన విగ్రహం వద్ద విశ్రాంత తెలుగు భాషాచార్యులు దేవులపల్లి విశ్వనాధం ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత వీరరాఘవ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ నాయుడు, తెలుగు భాషాభిమాని తురిమెళ్ళ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని తిమ్మారెడ్డి పల్లె గ్రామంలో శ్రీశ్రీ శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి వార్ల తిరునాళ్ల సందర్భంగా టిడిపి గిద్దలూరు నియోజక ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎడ్ల పోటీలను అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల పోటీలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు భువనేని వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటిని పరామర్శిస్తున్న దారపనేని

మేకపాటికి దారపనేని పరామర్శ

ప్రజాశక్తి-పామూరు

నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అస్వస్థకు గురైన మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి చెన్నైలోని కార్పొరేట్ హాస్పిటల్ చిక్సిత పొందాడు. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అందులో భాగంగా చంద్రశేఖర్ ఎమ్మెల్యే మేకపాటిని పరామర్శించారు. ఆయన ఆర్యోగ పరిస్థితుల గురించి

టాలెంట్ టెస్టు నిర్వహణ అభినందనీయం

మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్ ఎంతోగానో ఉపయోగ పడుతుందని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తెలిపారు. కనిగిరి కేటీఆర్ టెక్నో స్కూల్‌లో వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ విద్యావేత్త, పారిశ్రామిక వేత్త శ్యామల కాశిరెడ్డి చిన్నప్పటి నుంచి ఓ లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యంతో ప్రతి సంవత్సరం టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేటిఆర్ టెక్నో స్కూల్ చైర్మన్ కుందూరు తిరుపతిరెడ్డి, శ్యామల వెంకట్ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధి వెలుగొండ రెడ్డి, టిడిపి వెలుగొండ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, శ్రీనివాస ఆచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు : స్థానిక కేటిఆర్ టెక్నోస్కూల్‌లో శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టుకు 430 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు అందజేశారు. అనంతరం కాశిరెడ్డి మాట్లాడుతూ శ్యామల కాశిరెడ్డి తన తండ్రిపేరుమీద ట్రస్ట్ ఏర్పాటు చేసి 11 ట్యాలెంట్ టెస్ట్‌లు ,సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లుతోపాటు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేటిఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, ప్రిన్సిపల్ భాస్కర్, పాతపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసాచారి, శ్యామల వెంకటరెడ్డి పౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి కాశిరెడ్డి

నేడు చౌడమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని మునగపాడులో కొలువైన శ్రీ చౌడేశ్వరి(చౌడమ్మ) అమ్మవారి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరగనుంది. తొగట క్షత్రీయ కుటుంబీకుల ఇలవేల్పు అయిన శ్రీచౌడమ్మ అమ్మవారి తిరునాళ ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు నిర్వహించడం ఆనవాయితీ. తిరునాళ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి మస్తాబు చేశారు. వెలిగండ్ల గ్రామం నుంచి రెండు విద్యులు ప్రభలు, మునగపాడు నుంచి ఒకటి విద్యుత్ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నారు. దర్శి డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో పొదిలి సిఐ సుధాకరరావు ఆధ్వర్యంలో పలువురు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.దీపిక తెలిపారు.

నాగరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

నాగరాజుకు నివాళి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని ఐనముక్కల గ్రామానికి చెందిన దర్శనం నాగరాజు (48) శనివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు నాగరాజు మృత దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి ఆదిమూలపు సురేష్ ఫోన్‌లో మృతుడు కుమారుడు బద్రిని పరామర్శించారు. టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి మట్టి ఖర్చులకు రూ. 10 వేల నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి నాయకులు రావిక్రింది సుబ్బరత్నం రూ. 5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాబు, శ్రీనివాస యాదవ్, చెన్నారెడ్డి, వైసిపి మండల కన్వీపర్ గంటా వెంకట రమణారెడ్డి, బొమలాపురం ప్రధానోపాధ్యాయుడు సన్నిది కిశోర్ కుమార్, ఉపాధ్యాయులు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్స్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

వీల్‌చైర్స్ అందజేత

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజలకు సేవ చేసేందుకే తాను రాజకీయాల్లో వచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి నియోజకవర్గ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా తాను కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో మానవతా సేవాదల్ కన్వీనర్ నీలిశెట్టి సుబ్బారావు సహకారంతో వికలాంగులకు వీల్ చైర్స్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు సోమిశెట్టి శ్రీనివాసులు, డాక్టర్ చప్పరపు గురుబ్రహ్మం, ముక్కు బాలకృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిఆర్‌పిఎస్ నాయకులు

నేడు అమరవీరుల సంస్మరణ సభ

శింగరాయకొండ : ఎంఆర్‌పిఎస్ వ్యవ స్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య నాయ కత్వంలో శనివారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్ మాదిగ అమర వీరుల సంస్మరణ సభ నిర్వహి స్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకుడు రావినూతల కోటయ్య తెలిపారు. ఈసభలో ఎంఆర్‌పిఎస్ నాయకు లందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎస్‌సి రిజర్వేషన్లను ఎ,బి,సి,డి,లుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ, 1994 జులై 7న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, ఈదుమూడి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ప్రారంభమైనట్లు తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమర వీరులని స్మరించుకొని, వారు చేసిన త్యాగాలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎస్‌సి వర్గీకరణ సాధించిన రోజే మాదిగ అమరవీరులకు ఘనమైన నివాళులర్పించినట్లు అవుతుందని తెలిపారు. అనంతరం సంసర్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు రేణమాల మాధవ్ మాదిగ ,రావినూతల వెంకటేష్ మాదిగ, పోనుగోటి ఉదయ్ కుమార్ మాదిగ, సూరపోగు మొజేష్ మాదిగ పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జి విద్యా సంస్థల డైరెక్టర్, వైసిపి యువనేత ఆదిమూలపు విశాల్ మాట్లాడుతూ సమాజంలోని ఉన్నత స్థాయిలోని వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అంకిత భావంతో కృషి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. సమాజ మరియు దేశ అభివద్ధికి పాటు పడాలన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా ఆధునిక టెక్నాలజీలను నేర్చుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. చదువుతోనే గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం శ్రీ గౌతమి విద్యా సంస్థల అధినేత కనుమర్ల గుండారెడ్డి, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరన్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయ భాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, శ్రీ గౌతమి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గుంటక త్రిపురారెడ్డి, శ్రీగౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవిబాబు, యర్రగొండపాలెం నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి కళాశాల అధ్యాప కులు, అధ్యాసకేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిమూలపు విశాల్

నాగయ్య మృతి బాధాకరం

డాక్టర్ మాదాసి వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని వ ం ల్ల వ ర ప్పా డ ు ఎంపిటిసి దామచర్ల నాగయ్య మృతి ఎంతో బాధాకరమని పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య తెలిపారు. ఎంపిటిసి నాగయ్య మృత దేహాన్ని డాక్టర్ వెంకయ్య సోమవారం సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకయ్య మాట్లాడుతూ ఎంపిటిసి నాగయ్య మల్లవరప్పాడు, తూర్పు నాయుడుపాలెం గ్రామాలలో వైసిపి అభివద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేశారని తెలిపారు. ఆయన మతి పార్టీకి తీరని లోటఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దామచర్ల అనిల్, దామచర్ల బుజ్జి, మన్నం హరిబాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణ, వైసిపి నాయకులు వల్లంరెడ్డి రమణారెడ్డి, దావులూరి సునీల్, అద్దంకి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ వెంకయ్య

విలేకరుల సమావేశంలో గ్రామస్తులు

గుడి జోలికి వస్తే సహించేది లేదు

బాలయోగినగర్ వాసుల హెచ్చరిక

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బాలయోగి నగర్ స్వామి గుడి జోలికి వస్తే సహించేది లేదని కాలనీ వాసులు హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాలనీ వాసులు మాట్లాడారు. కొందరు బాలయోగి నగర్ స్వామి గుడికి సంబంధించిన బావిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయం గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదులు చేసినప్పటికీ వారు కూడా పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాలయోగినగర్ స్వామి గుడికి బావి ఆక్రమణలు ఆపపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంగు వసంతరావు, హనుమయ్య, అశోక్ ,ఇంతియాజ్ ,సుబ్రహ్మణ్యం, సుమన్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బ్లూబగ్గింగ్ తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి వకుల్ జిందాల్ పేర్కొన్నారు. పరిచయం లేని వ్యక్తులు బ్లూటూత్ ద్వారా పంపే పెయిరింగ్ రిక్వెస్ట్‌లకు స్పందించవద్దని అన్నారు. బ్లూటూత్‌తో సైబర్ మాయచేసి బ్లూబగ్గింగ్ తో స్మార్ట్ ఫోన్‌లను హ్యాకింగ్ చేస్తార వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ బ్లూబగ్గింగ్ తరహా సైబర్ మోసాల జరిగే తీరును, బ్లూబగ్గింగ్ మోసాల బారిన పడకుండా వుండడానికి ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుత రోజులలో చేతికి పెట్టుకున్న డిజిటల్ వాచీ, చెవులకి ధరించిన ఇయర్‌పాడ్ పనిచేయాలన్నా, కారులోని మ్యూజిక్ సిస్టమ్‌తో అనుసంధానమవ్వాలన్న బ్లూటూత్ నే ఉపయోగిస్తున్నారు. ప్రతి ఒక్కరు హ్యాండ్ ఫ్రీ సాంకేతికతలో భాగంగా వైర్‌లెస్ పరిజ్ఞానాన్ని విస్తతంగా వినియోగిస్తున్నారని, దీని ఆసరాగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు బ్లూబగ్గింగ్ పేరిట మోసం చేస్తున్నారని తెలిపారు.

బ్లూబగ్గింగ్ మోసాల జరిగే తీరు

బహిరంగ ప్రదేశాల్లో 10 మీటర్ల దూరంలో బ్లూటూత్ ఆన్ లో ఉన్న మొబైల్స్ కి సైబర్ నేరగాళ్లు పెయిర్ రిక్వెస్ట్ పంపిస్తారన్నారు.పొరపాటున కనెక్ట్ అయితే మీ మొబైల్ లోకి మాల్వేర్ పంపిస్తారన్నారు. మీ మొబైల్ ఫోన్ లోని ఫోటోస్, ఫైల్స్, ఇతర ముఖ్యమైన డేటాని దొంగిలించి డబ్బులకోసం బ్లాక్‌మెయిల్ చేస్తారన్నారు. బ్లూబగ్గింగ్ మోసాల బారిన పడకుండా వుండడానికి బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు అవసరమైతే తప్ప మిగిలిన అన్ని సమయాలలో బ్లూటూత్ ఆఫ్ చేయాలన్నారు.గుర్తుతెలియని పరికరాలు, పరిచయం లేని వ్యక్తులు బ్లూటూత్ ద్వారా పంపే పెయిరింగ్ రిక్వెస్ట్‌లకు స్పందించకూడదన్నారు.అవసరం లేకపోతే అప్పటి వరకూ మీ మొబైల్ ఫోన్ తో అనుసంధానమైన బ్లూటూత్ పరికరాలతో అన్‌పెయిర్ చేయాలన్నారు.బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బహిరంగ ప్రాంతాలలోని ఉచిత వైఫై వినియోగించవద్దన్నారు.డేటాలో హెచ్చుతగ్గుల్ని గమనిస్తూ ఉండాలని, అదనపు భద్రతకు వీపీఎన్ వినియోగించాలన్నారు.బ్లూబగ్గింగ్ మోసానికి ఎవరైనా గురైనట్లయితే మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని ఎస్పి తెలిపారు.

ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకోండి

సిఐటియు మండల కార్యదర్శి మల్లారెడ్డి

ప్రజాశక్తి-పంగులూరు

బిల్లులు ఇచ్చేందుకు అందులో పది శాతం లంచాలు ఇవ్వాలని అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతున్న ఐసిడిఎస్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఐటియు పంగులూరు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. 'బిల్లులు కావాలా? డబ్బులు ఇవ్వండి' అనే శీర్షికతో ఇటీవల 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురణమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై ఆదివారం సాయంత్రం సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి పంగులూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐసిడిఎస్ అధికారులు లంచాల కోసం అంగన్‌వాడీలను వేధించడం సరైంది కాదని అన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి అంగన్‌వాడీలు కేంద్రాలను నడుపుతున్నారని, వీరిని ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు అధికారులు వేధించటం ఎక్కువైందని అన్నారు. బిల్లులు చేసినందుకు ట్రెజరీలలో లంచాలు ఇవ్వాలనే పేరుతో లక్షల రూపాయలు అంగన్‌వాడీల నుంచి బలవంతపు వసూలు చేయటం సహించరాని నేరమని అన్నారు. మాట వినని అంగన్‌వాడీలకు మెమోలు ఇవ్వడం, ఇబ్బందులు పెట్టడం ఐసిడిఎస్ అధికారులకు మామూలు అయిపోయిందని మల్లారెడ్డి విమర్శించారు. గతంలో కోడిగుడ్లను కేంద్రాలకు చేర్చకుండానే చేర్చినట్టు రికార్డులలో రాసుకొని, కోడిగుడ్ల సొమ్ము స్వాహా చేసిన చరిత్ర ఇక్కడి ఐసిడిఎస్ అధికారులకు ఉందని మల్లారెడ్డి చెప్పారు. పర్సెంటేజీల విషయమై తక్షణమే ఉన్నతాధికారులతో ఎంక్వయిరీ చేయించి, దోషులపై చర్యలు తీసుకోవాలని, అవినీతిని నిర్మూలించాలని మల్లారెడ్డి కోరారు.

టీచర్ వెర్రిబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి-పంగులూరు

టీచర్ వెర్రిబాబు (ఫైల్)

విద్యార్థులకు పాఠాలు చెబుతూ తరగతి గదిలోనే గుండెపోటుతో ప్రాణాలు వదిలిన ఉపాధ్యాయుడు పాలపర్తి వెర్రి బాబుకు ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. వేటపాలెం మండలం వాకావారి పాలెం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వెర్రిబాబు స్వగ్రామం పంగులూరు. ఆదివారం సాయంత్రం పంగులూరులో ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. అంతకుముందు యుటిఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు వెర్రిబాబు పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఏప్రిల్ 8వ తేదీ జరగనున్న నాయీ బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమ కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి వివాహ పరిచయ వేదిక కన్వీనర్ నాదెండ్ల రాఘవ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షులు పిల్లుట్ల సుధాకర్‌రావు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తొండ మల్లి చిన్న రంగయ్య, జిల్లా ఉద్యోగ సంఘం కార్యవర్గ సభ్యులు అన్నవరపు వెంకటేశ్వర్లు, మునగపాటి వెంకటనారాయణ, మధుబాబు, వెంకట్రావు, ఆదెయ్య, పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయలు

నెలరోజుల వ్యవధిలో ధరలు రెట్టింపు

ఆందోళన చెందుతున్న సామాన్యులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజుల వ్యవధిలో ధరలు అమాంతం రెట్టింపయ్యాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో టమాటాలు కిలో రూ.10 ఉండగా ప్రస్తుతం రూ.30కి విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు కేజీ రూ.20 నుంచి రూ.50కి చేరాయి. బీన్స్, క్యాబేజీ పువ్వు గత నెలలో కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.60కి విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.40 నుంచి రూ.60కి చేరుకుంది. బీరకాయలు, గోరుచిక్కుడు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, క్యాబేజీ రూ.30 నుంచి రూ.60కి పెరిగింది. కాకరకాయలు రూ.30 నుంచి రూ.60కి చేరుకున్నాయి. అల్లం రూ. 100లకు చేరింది. పచ్చిమిర్చి రూ. 60లకు చేరుకుంది. ఆకు కూరలు రూ. 10లకు చేరంది. మునక్కాయలు రూ. 200లు పలుకుతుంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో యర్రగొండపాలెం పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలలాల్లో రోజుకు 15 నుంచి 20 టన్నుల కూరగాయలు విక్రయాలు సాగుతాయి. నిత్యావసర ధరల పెంపు కారణంగా కూరగాయల ధరలు భారీగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరల కారణంగా ఒక్కో కుటుంబంపై ప్రతి నెలా సుమారు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అదనపు భారం పడుతోంది. అసలే పనులు లేక పూట గడవడం కష్టంగా ఉన్న కటుంబాలకు కూరగాయలు ధరలు మరింత భారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.500పైనే ఖర్చు

ప్రజలు ఏది కొన్నాలన్న ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. వర్షాభావ ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల కూరగాయల సాగు తగ్గింది. కూరగాయల కోతతో రేట్లు అమాంతంగా పెరిగిపోయాయి. గతంలో రూ. వంద తీసుకొని మార్కెట్‌కు వెళ్లితే వారానికి సరిపడ్డ కూరగాయలు వచ్చేయన్నారు. ప్రస్తుతం రూ. 500లు తీసుకెళ్లినా నాలుగు రకాల కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. వర్షాలు కురిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉండడం వల్ల ప్రజలు కొద్ది రోజులు తిప్పలు పడక తప్పదు. కూరగాయల ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయలు కొనలేం..తినలేం

నాగుల లింగమ్మ, గృహిణి, యర్రగొండపాలెం

నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగడంతో ఏమీ కొనలేని.. తినలేని పరిస్థితి నెలకొంది. టమాటా, ఉల్లి, ధరలు కూడా పెరగడంతో అదనపు భారం పడుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పచ్చడి మెతుకులు తినడం కూడా కష్టంగా మారడం తప్పదు.

పెరిగిన ధరలతో ఆర్థిక భారమే

లక్ష్మిబాయి, గృహిణి, నాగరాజుతాండా

రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో మధ్య తరగతి కుటంబాలపై మరింత ఆర్థిక భారం పడింది. రోజువారీ వంటకాల్లో ఉల్లి, టమాట వినియోగాన్ని తగ్గించేస్తున్నాం. ధరల భారంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది.

వర్షాలు కురిసేంత వరకు ధరలు తగ్గేలా లేవు

కొమర రవి, కూరగాయల వ్యాపారి, యర్రగొండపాలెం

కూరగాయల ధరలు రోజు రోజుకు పెరుగుతున్న మాట వాస్తవమే. టమాట ధర మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా కూరగాయలన్నీ కడప జిల్లాలోని మైదుకూరు, కర్నాటకలోని హోస్‌పేట, బాపట్ల జిల్లాలోని మార్టూరు, తెలంగాణ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో ఒక రోజు ఉన్న ధరొక రోజు ఉండడం లేదు. క్రమంగా ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

ఉచిత వైద్య శిబిరానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం ముత్తాయపాలెం, అడవి పంచాయతీల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు, ప్రజల సౌకర్యార్థం సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. 6వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం సచివాలయం పరిధిలోని తీరప్రాంత గ్రామాల ప్రజానీకానికి, మత్స్యకారులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందిస్తామని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరాన్ని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న నాయకులు

ఇప్పటం చర్య అప్రజాస్వామికం

జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మత్తి భాస్కరరావు

ప్రజాశక్తి-రేపల్లె

ఇప్పటంలో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణ పేరుతో కక్షపూరితంగా ఇళ్లు కూల్చివేయడం అప్రజాస్వామికమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మత్తి భాస్కరరావు అన్నారు. రేపల్లెలోని జనసేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ రేపల్లె పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ అధ్యక్షత వహించారు. లక్ష్మీ టాకీస్ బజార్‌లో ఉన్న జనసేన పార్టీ పట్టణ పట్టణ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మత్తి భాస్కరరావు మాట్లాడారు. కూల్చివేతలతో పాలనను ప్రారంభించిన ఈ రాష్ట్ర ప్రభుత్వం కూలిపోయేరోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. తమ పార్టీ సభ కోసం ఇప్పటం గ్రామస్తులు స్థలం ఇచ్చారన్న కోపంతోనే వైసిపి ప్రజా ప్రతినిధులు ఈ కూల్చివేతలు మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పటంలో ప్రజల ఇళ్లను ధ్వంసం చేయటమే ఇందుకు తార్కాణమని అన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు జనసేన ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరం మండలం అధ్యక్షులు గోపరాజు ఉదయ్ కృష్ణ జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి-రేపల్లె

వెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. పట్టణంలోని 11వ వార్డులోని లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రేపల్లె పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి దంపతుల చేతుల మీదుగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. తదుపరి పది వేల మందికి అన్నదానం నిర్వహించారు.

108 ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-చీరాల: అంబులెన్స్ సర్వీసులో పైలెట్, డ్రైవర్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని 108 జోనల్ హెచ్ఆర్ బ్రహ్మం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలలో పైలెట్లు ఉద్యోగాలకు ఖాళీలు ఉన్నాయని అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండి ఇంగ్లీషు చదవడం రాయడం వచ్చి ఉండాలని అన్నారు. అభ్యర్థులు ఈ నెల ఏడో తేదీ ఉదయం 10 గంటలకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఒంగోలు రిమ్స్ క్యాంపస్‌లో 108 జోనల్ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 8096242990 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

మాట్లాడుతున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-దరిశి

విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి పాఠశాలకు, దరిశికి మంచిపేరు తీసుకురావాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక చవటపాలెం రోడ్‌లోని గౌతమి గ్రామర్ స్కూల్ మరియు పిఆర్ కెఆర్ మహిళా జూనియర్ కళాశాల 13వ వార్షికోత్సవం ఆ విద్యాసంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్ పాపసాని రాజకేశవరెడ్డి అధ్యక్షతన శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకొని బాగా చదివి అన్ని రంగాలలో రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి కూడా విద్యతో పాటు ఆటలు, పాటలు నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దరిశి మాజీ ఎమ్మెల్యే డాక్టరు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజకేశవరెడ్డి ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్స్‌లో అవకాశం కల్పించాలి

- రాష్ట్ర పిఎంపి, ఆర్‌ఎంపి నాయకుల డిమాండ్
- ఆర్‌ఎంపి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బట్టు, కె.బాలచంద్రం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్, రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్‌కు విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే అవకాశం కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యుల సంక్షేమం ప్రకాశం జిల్లా 8వ మహాసభ ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సభకు ద్రోణాదుల సింగయ్య అధ్యక్షత వహించారు. రాష్ట్ర పిఎంపి, ఆర్‌ఎంపి నాయకులు విబిటి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పిఎంపిలో 50 వేల మంది ఉన్నారని, వారికి ఎలాంటి గుర్తింపు లేదన్నారు. వీరికి పారా మెడికల్ బోర్డు ద్వారా శిక్షణ ఇచ్చి విలేజ్ క్లినిక్స్‌లో అవకాశాన్ని కల్పించాలన్నారు. అనుభవం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కోరారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కెసి మాల్యాద్రి నాయుడు మాట్లాడుతూ నేటికి గ్రామాలలో ఆర్‌ఎంపిలు అవసరం ఎంతైనా ఉందని, ప్రస్తుత పరిస్థితులలో రోజురోజుకీ వైద్య విధానంలో మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ కె.ఆదర్శ్ మాట్లాడుతూ ఎముకల వైద్యంలో చాలా మార్పులు వచ్చాయని, రోబో విధానంలో శస్త్ర చికిత్సలు చేస్తున్నామన్నారు. మొట్టమొదటి సారిగా ప్రకాశం జిల్లాలో ఆదర్శ్ హాస్పిటల్‌లో అతి తక్కువ ఖర్చుతో చేస్తున్నామన్నారు. ఒంగోలు డిఎస్‌పి యు.నాగరాజు మాట్లాడుతూ గ్రామాలలో ప్రథమ వైద్యం ఆర్‌ఎంపిల ద్వారా జరుగుతుందని, పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ పరిధి దాటి వైద్యం చేయటం సరికాదని, వైద్య విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలన్నారు. సభలో జిల్లాలోని 70 మంది ఆర్‌ఎంపి, పిఎంపిలు పాల్గొన్నారు. సభలో జిల్లా కార్యదర్శి వి.మాల కొండయ్య గత కార్యకలాపాలు వివరించారు. సభలో జిల్లా నాయకులు బట్టు బాలాజిరావు, పి.చంద్రశేఖర్, కెకె.బాలచంద్రం, కె.రాజ గోపాల్, డి.సుధాకర్, పి.నాగరాజు, జి.భాస్కర రావు, ఎస్‌కె ఇమాం సాహెబ్, పి.సుధాకర్ రావు, టి.రమేష్, పివి కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ మాల్యాద్రినాయుడు

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

గ్రామీణ వైద్యుల సంక్షేమం జిల్లా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బట్టు బాలాజిరావు, ప్రధాన కార్యదర్శిగా కె.బాలచంద్రం, కోశాధికారిగా కందుకూరు రాజగోపాల్, ఉపాధ్యక్షులుగా షేక్ ఇమాం సాహెబ్, సహాయ కార్యదర్శిగా పి.కృష్ణారావు, కార్యనిర్వాహ కార్యదర్శిగా పి.నాగరాజు, మీడియా ఇన్‌చార్జి దాసరి సుధాకర్ ఎంపికయ్యారు.

బాలాజిరావు, కె.బాలచంద్రం, రాజగోపాల్

ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రశ్నించే గొంతుకలను గెలిపించండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రశ్నించే గొంతుకలను గెలిపించి.. చట్టసభలకు పంపాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన జిల్లాలోని తాళ్లూరు, ముండ్లమూరు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో తూర్పు రాయలసీమ పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొక్కిరెడ్డి బాబురెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి.. గెలిపించాలని కోరారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యా సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ ఇన్‌ఛార్జి ఎంఎల్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగుల పిఎఫ్ నగదు, ఎపిజిఎస్ఐ నిధులు ఇష్టానుసారంగా వాడుకుంటూ ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతోందని విమర్శించారు. సర్వీస్ తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ సచివాలయ ఉద్యోగుల్లో సగం మందిని రెగ్యులర్ చేయకుండా రూ.15 వేలు వేతనంగా అందజేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఏడు లక్షల మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు లొంగకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగుల పక్షాన నిలబడే పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యాత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ వీరారెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్, ఎస్టీయూ, డిటిఎఫ్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అభ్యర్థులుగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, కొక్కిరెడ్డి బాబురెడ్డిలు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకులు డికెఎం రఫీ, గొపిదేశి మల్లయ్య, దొడ్డా సుబ్బారెడ్డి, గాయం వెంకటేశ్వరరెడ్డితో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు చర్యలు

- రోగులకు పౌష్టికాహారం
- రోగి కుటుంబసభ్యులకు పరీక్షలు
- అందుబాటులో నివారణ మందులు
- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అనుసరించి జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో 2025 నాటికి జిల్లాలో క్షయ నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో 2500 మంది క్షయ రోగులకు చికిత్సకు అందిస్తున్నామ న్నారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ పథకంలో సుమారు 700 మందికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. క్షయ రోగుల కుటుంబ సభ్యులకు క్షయ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నా మన్నారు. అందరి సహకారంతో 2025 నాటికి జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన చేసేందుకు చర్యలు చేపడతున్నామని చెబుతున్న జిల్లా క్షయ నివారణ అధికారితో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో 2025 నాటికి జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలనకు చర్యలు చేపట్టాం. క్షయ రోగులను గుర్తించటం, వారికి వైద్య చికిత్సలు అందిస్తున్నాం. రెండు వారాలకు అంతకు మించి దగ్గు, రెండు వారాలు లేదా అంతకు మించి జ్వరం, బరువు అధికంగా కోల్పోవటం, దగ్గితే కళ్ళెలో రక్తం పడటం, ఛాతి ఎక్స్‌రేలో అనుమానాస్పద మరక కనపడటం క్షయ లక్షణాలు. సూక్ష్మ దర్శిని(మైక్రో స్కోప్), ఆర్‌టిపిసిఆర్ పరీక్ష, సిబినాట్ మెషీన్ ద్వారా క్షయ వ్యాధిని నిర్ధారించవచ్చు. మార్కాపురం జిల్లా వైద్యశాలలో, ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు సిబినాట్ మెషీన్స్ ఉన్నాయి. సిబినాట్ మెషీన్‌లో పరీక్ష నిర్వహించేందుకు రూ.రెండు వేలు ఖర్చు అవుతుండగా.. రోగులకు ఉచితంగా పరీక్ష నిర్వహిస్తున్నాం. కణజాల పరీక్ష(బయాప్సీ)లో నిర్ధారించి మందులు ఉచితంగా అందిస్తున్నాం. జిల్లాలో ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులలో క్షయ నిర్ధారణ చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 26 మైక్రో స్కోప్స్ ఉండగా, విభజన తరువాత ప్రస్తుతం 16 అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో మొత్తం 40 కళ్ళె పరీక్షా కేంద్రాలు ఉండగా, విభజన తరువాత 30 కేంద్రాలున్నాయి.

జిల్లాలో 2262 క్షయ కేసులు

జిల్లాలో ప్రస్తుతం 2262 క్షయ కేసులు ఉన్నాయి. 2015లో 2569, 2016లో 3002, 2017లో 3430, 2018లో 4209, 2019లో 4797, 2020లో 3031,2021లో 4603, 2022 జూన్ వరకు 2262 కేసులు నమోదయ్యాయి. నెలకు 44 కేసులు నమోదు చేయాల్సి ఉండగా 80 శాతం సాధించాం. ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి కేసుల నమోదు చేసుకోవటం 85 శాతం ఫలితాన్ని సాధించాం. ప్రైవేట్ వైద్యులు టిబి కేసును పంపితే రూ. 500 పారితోషికం అందిస్తున్నాం. ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి నెలకు 100 కేసులు వస్తున్నాయి.

రోగులకు అందుబాటులో మందులు

జిల్లాలో 2500 మంది క్షయ రోగులు ఉన్నారు. వీరికి డాట్స్, ఆశ కార్యకర్తల ద్వారా మందులు పంపిణీ జరుగుతోంది. మొండి క్షయ రోగులకు రూ.10 లక్షల విలువైన 188 ట్యాబెట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. డాట్స్ క్షయ రోగులకు ఇంటికి వెళ్ళి వారికి మందులు ఇచ్చి వాడే విధానంపై అవగాహన కల్పిస్తారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే కేసుల వివరాలను జిల్లా కేంద్రానికి తెలియజేయాలి. రోగి క్షయ నివారణ సంస్థకు మందులు తీసుకొని రావటానికి ఇష్టం లేకపోతే మందులను ప్రైవేట్ ఆసుపత్రికి పంపించి పంపిణీ చేయిస్తున్నాం.

క్షయ రోగులకు పౌష్టికాహారం

ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జిల్లాలోని సుమారు 700 మంది రోగులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. క్షయ రోగులను దాతలు దత్తత తీసుకొని 6 నెలల పాటు నెలకు రూ.500 విలువైన పోషకాహారం అందిస్తున్నాం. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు 25 మందిని దత్తత తీసుకున్నారు. గుళ్ళాపల్లికి చెందిన భారత్ బయోటెక్ సంస్థకు చెందిన సురేష్ కుమార్ 25 మందిని దత్తత తీసుకొని పోషకాహారం అందిస్తున్నారు. గ్లాండ్ అనే మందుల కంపెనీ జిల్లాలోని 500 మంది క్షయ రోగులను దత్తత తీసుకొని వారికి పౌష్టికాహారం అందిస్తున్నారు.

రోగి కుటుంబసభ్యులకు పరీక్షలు

క్షయ రోగి కుటుంబసభ్యులకు పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. టిబి రాకుండా చికిత్సను అందిస్తున్నాం. ఐసోనియాజిడ్ మందును 6 నెలల పాటు ప్రతి రోజు ఇవ్వాలి. ఐసోనియాజిడ్, రిమోపిసిన్ మందులు 3 నెలలు వాడాలి. ఐసోనియాజిడ్, రిపాపెంటిన్ మందును 3 నెలలు వారానికి ఒక రోజు 12 డోసులు ఇవ్వాలి. అందరి సహకారంతో 2025 నాటికి జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన చేసేందుకు చర్యలు చేపడతాం.